# కైవల్యోపనిషత్తు

– డా. కోగంటి రామానుజాచార్యులు

**ఉపోద్ఘాతము :**

కైవల్యోపనిషద్వేద్యం కైవల్యానందతుందిలం।
కైవల్యగిరిజారామం స్వమాత్రం కలయేఽన్వహం॥

అథర్వవేదాన్తర్గతమైన కైవల్యోపనిషత్తులో కేవలానందమును ప్రసాదించు మోక్షదాయకమైన కైవల్యమార్గము ప్రతిపాదించబడినది.

ఒకప్పుడు అశ్వలాయనమహర్షి భగవంతుడగు బ్రహ్మదేవునిసన్నిధికి వెళ్ళిహేభగవాన్. ఎల్లప్పుడు సత్పురుషులచేతను, మహనీయులచేతను సేవించబడే అతిరహస్యమైనది, సర్వపాపముల నుండి ఈజీవుని సముద్ధరించునది, పరమపురుషార్థప్రాప్తిని కలిగించే 'బ్రహ్మవిద్యను' ఉపదేశించమని ప్రార్థించగా, బ్రహ్మదేవుడు అశ్వలాయనమునికి బోధించిన బ్రహ్మవిద్యారహస్యమే ఈ కైవల్యోపనిషత్.

అశ్వలాయనా! పరాత్పరమపురుషుని చేరాలంటే అందుకు శ్రద్ధ, భక్తి, ధ్యానము, యోగాభ్యాసమే శరణ్యము. **'న కర్మణా న ప్రజయా ధనేన త్యాగేనైకేఅమృతత్వమానశుః'** అంతేగాని లౌకికకర్మలచేతనో, పుత్ర–శిష్య, బంధు–మిత్రాది జనసంపదచేతనో, ధనముచేతనో లభించేది కాదు, ఒక్క 'త్యాగము' తో మాత్రమే అమృతత్త్వమును ఈ జీవుడు పొందగలుగుతాడు. ఆ స్థానము స్వర్గము మొదలైన లోకములకు కూడా ఆవల ఉన్నట్టిది. అయితే అది ఈ జీవుని యొక్క హృదయగుహలోనే ఉన్నది. కనుక అత్యంతసమీపమైనదికూడా!

1) వేదాంతవిజ్ఞానముచేత నిశ్చితమైన అర్థమును బుద్ధిలో గ్రహించటంచేతను,

2) "ఇంద్రియదృశ్యములో నాదీ అనునది ఇక్కడఏదీలేదు! సర్వము పరమాత్మకు చెందినదే" అనే రూపముతో కూడిన సన్న్యాసయోగము చేతను వివేకులు ఆ పరబ్రహ్మమును ఇక్కడే, ఇప్పుడే, తమ యందే పొందుచున్నారు. అట్టివారు ఇహ సంబంధమైన జన్మ-కర్మల వ్యవహారమంతాఅధిగమించి, స్వర్గాదులకు అవతలచేరి బ్రహ్మలోకములో పర-అమృతస్థానమును అధిరోహిస్తున్నారు.

**అమృతస్థానమును పొందుమార్గము**

**'వివిక్తదేశే చ సుఖాసనస్థః శుచిః సమగ్రీవశిరఃశరీరః, అంత్యాశ్రమస్థః సకలేంద్రియాణి నిరుధ్యభక్త్యాస్వగురుంప్రణమ్య'**

ఏకాంతప్రదేశములో సుఖాసనములో మనస్సునునిర్మలముగా, శుచిగా ఉంచుకుంటూ, శిరస్సు – శరీరము నిలువుగాధారణచేసి యోగాభ్యాసంచేయాలి. సకలఇంద్రియ – ఇంద్రియవిషయములు మననమును నిరోధిస్తూ, భక్తిప్రపత్తులతో బ్రహ్మతత్వమును బోధించు సద్గురువుకు నమస్కరించి హృదయమధ్యగతుడైన పరమాత్మను చింతనచేయాలి! "సర్వాత్మకుడవు, పర్వతత్వ స్వరూపుడవు అగు పరమాత్మా! నీవు నా హృదయమున వేంచేసియే ఉన్నారు కదా!" అని ఉపాసించాలి.

**పరాత్పరుడగుపరమాత్మ ఎలాంటివాడు?**

అచిన్త్యుడు, అవ్యక్తుడు, అనన్తరూపుడు, శుభస్వరూపుడు, పరమప్రశాంతుడు, అమృతస్వరూపుడు, పరబ్రహ్మస్వరూపుడు, ఆదిమధ్యాంతరహితుడు, ఏకైకుడు, చిదానందస్వరూపుడుగా ఈరీతిగా హృదయకమలములో ఆయనను ఉపాసించాలి. ప్రకృతిరూపమగు 'ఉమ'తో కూడుకొన్న పరమేశ్వరుని పరాత్పరుని ధ్యానిస్తూ, సర్వ భూతజాలములకు ఉత్పత్తిస్థానమగు పరమాత్మను మునులుచేరుచున్నారు.

ఆయనేసృష్టికర్తయగుబ్రహ్మ, సదాశివుడు, ఇంద్రుడు, శ్రేష్ఠుడు, సర్వ వ్యాపకుడైన విష్ణువు, ఆయనయేప్రాణశక్తిస్వరూపుడు,కాలస్వరూపుడు, అగ్ని , చంద్రుడు ... సర్వస్వరూపుడు,భూత వర్తమాన భవిష్యత్తులలో విరాజిల్లు సర్వము సర్వదా సనాతనమగు ఆపరమాత్మయే!, అట్టిపరమాత్మ (పరబ్రహ్మము)ను ఎరుగుట చేత మాత్రమే ఈజీవుడు మృత్యువును జయించి వేయగలడు, ఇంతకు మించి మృత్యువును జయించటానికి వేరేత్రోవ లేనేలేదు.

**పరమాత్మను ఎరుగుట అనగా? ఏమని ఎరుగటము?**

**'సర్వభూతస్థమాత్మానం సర్వభూతాని చాత్మని'** పరమాత్మసర్వజీవులయందు, పరమాత్మయందే సమస్తజీవులు సంస్థితులైఉన్నారు. అనే మనోఅభ్యాసముచే జీవులు పరబ్రహ్మమును దర్శించగలరు. పరమాత్మ సందర్శనమునకు వేరే త్రోవలేదు!

నిత్యానిత్యవివేకియగు పండితుడు.., జీవాత్మను అగ్నిపుట్టించే క్రింద అరణిగాను, ప్రణవమును ఉత్తరారణి గాను చేసుకుని, జ్ఞానము-అనే మథనముచేతను, ఆత్మానుభవాగ్నిని పొందుతున్నాడు. అట్టి బ్రహ్మ జ్ఞానాగ్నితో సంసారపాశమును మృత్యుపాశమును, దృశ్యము గురించిన భావావేశపాశమును దహించివేస్తున్నాడు.

పరమాత్మమాయ, కల్పన-భావనలచే 'శరీరము' అనే ఇంద్రియార్థ యంత్రమును ఆశ్రయించుచున్నాడు. ఇక సర్వము నిర్వర్తిస్తూ,. స్త్రీసాంగత్యము, అన్నపానాదులు మొదలైనవన్నీ జాగ్రదావస్థ లోపొందుతూ, "ఇవియే నా సంపూర్ణ-ప్రపంచము" అని భావిస్తాడు. ఇక స్వప్నములోనో ఊహలలో స్వప్నలోకంలో విహరిస్తుంటాడు. ఈ విధంగా జాగ్రత్తులో రోజురోజు అనేక ఇంద్రియ విషయాలు పొందుచూ వదలుచూ ఉండగా, స్వప్నదశలో అనేక స్వప్నాలువచ్చి కరగిపోవుచుండగా, పునర్జన్మాదులను పొందుతున్నాడు. సుషుప్తావస్థలో

తమోరూపసుఖం పొందుతున్నాడు. ఎవ్వడైతే జాగ్రత్-స్వప్న- సుషుప్తులనే 3 అవస్థలలోసంచారాలు చేస్తున్నాడో, అతని వలననే ఆతని నుండియే ఈ విచిత్ర విశ్వమంతా జనిస్తోంది తిరిగి ఆతనియందే లయిస్తోంది.

**జాగ్రత్-స్వప్న సుషుప్తులనబడేవి ఎందులోంచి వస్తున్నాయి? ఎందులో లయిస్తున్నాయి?**

**జాగ్రత్స్వప్నసుషుప్త్యాది ప్రపంచం యత్ప్రకాశతే, తద్బ్రహ్మాహమితి జ్ఞాత్వా సర్వబంధైః ప్రముచ్యతే..**

సమస్తమునకు ఆధారమైనవాడు, ఆనందస్వరూపుడు, అఖండబోధస్వరూపుడైన పరమాత్మనుండే జాగ్రత్-స్వప్న-సుషుప్తులనబడే మూడు ఒకసారి బయటబడి మరోసారి లయము పొందుచున్నాయి. ప్రాణశక్తి, మనస్సు, సర్వేంద్రియాలు, ఇంద్రియవిషయాలు:, ఆకాశము, వాయువు, అగ్ని(జ్యోతి), జలము, భూమి అనే పంచభూతాలు. ఇవన్నీ కూడా ఈ జీవుని సహజ స్వస్వరూపమగు పరమాత్మ నుండే జనిస్తున్నాయి. పరమాత్మయే ఆధారముగా కలిగి ఉన్నాయి.

**"ఇంతకి పరబ్రహ్మము అనగా ఎవ్వరు?"**

**యత్పరంబ్రహ్మ సర్వాత్మా విశ్వస్యాయతనం మహత్.** ఎవ్వరైతే సర్వమునకు పరమైనవాడో, పరబ్రహ్మ స్వరూపుడో, సర్వాత్మకుడో, మహత్స్వరూపుడైఉన్నాడో, అణువుకంటే అణువుగాను, మహత్తుకంటే మహత్తుగాను ఉన్నాడో, ఆపరమపురుషుడు, ఈ విచిత్రవిశ్వము ఎవరి స్వరూపమో, ఈ విశ్వమనే శరీరానికి ఎవరు శరీరిగా వున్నాడో, "జాగ్రత్స్వప్న-సుషుప్తులలోను ప్రపంచస్వరూపముగానుఏదైతేప్రకాశిస్తోందో, ఈ సృష్టి స్థితి లయములు ఎవరి యందు వున్నవో అట్టితత్త్వం బ్రహ్మమే. నేనే బ్రహ్మమును!" అని ఎప్పుడైతే ఈ జీవుడు గ్రహిస్తున్నాడో ఆమరుక్షణమే సర్వబంధములు అతనికి ఉండవు సమస్తమునకు కేవల సాక్షిని అని, స్వస్వరూప

పరమాత్మను ఎవ్వరు తెలుసుకుంటారో వారు శుద్ధ పరమాత్మ స్వరూపులే అగుచున్నారు! (బ్రహ్మవిత్బ్రహ్మైవభవతి)

**ఫలశృతి :**

**యః శతరుద్రీయమధీతే సోఽగ్నిపూతో భవతి సురాపానాత్పూతో భవతి**

'**శతరుద్రీయము**' అనే మరొక పేరుగల ఈ కైవల్యోపనిషత్ ఎవరు అధ్యయనము చేస్తారో వారు అగ్నివలె, వాయువువలె పరమ పవిత్రులు అవుతారు. అష్టమహాపాతకాలైన బంగారము దొంగిలించుట, సురాపానము, బ్రహ్మహత్య మొదలైనవి పాపముల నుండి విముక్తులుకాగలరు. సర్వకర్మ బంధముల నుండి విముక్తులౌతారు. ఈ ఉపనిషత్పఠించినా, అర్థమును తెలుసుకున్నా మోక్షమార్గమును పొందగలరు. అందుచేత చతుర్విధ ఆశ్రమములవారు(ఆశ్రమాతీతులగువారు) కైవల్యోపనిషత్తును కనీసం ఒకసారైనా పఠించాలి, తద్వారా ఆత్మజ్ఞానమును, కైవల్యమును పొందగలరు.

**ఇతి కైవల్యోపనిషత్**

**స్వస్తి**

# కైవల్యోపనిషత్

శ్లో. కైవల్యోపనిషద్వేద్యం కైవల్యానందతుందిలం ।
కైవల్యగిరిజారామం స్వమాత్రం కలయేఽన్వహం ॥

ఓం సహనావవతు । సహ నౌ భునక్తు । సహ వీర్యం కరవావహై ।
తేజస్వినావధీతమస్తు । మా విద్విషావహై ॥

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

## అథ కైవల్యోపనిషత్ ప్రారంభః

ఓం అథాశ్వలాయనో భగవంతం పరమేష్ఠినముపసమేత్యోవాచ ।
అధీహి భగవన్బ్రహ్మవిద్యాం వరిష్ఠాం సదా సద్భిః సేవ్యమానాం నిగూఢాం ।
యయాఽచిరాత్సర్వపాపం వ్యపోహ్య పరాత్పరం పురుషం యాతి విద్వాన్ ॥ ॥ 1 ॥

తస్మై స హోవాచ పితామహశ్చ శ్రద్ధాభక్తిధ్యానయోగాదవైహి ॥ ॥ 2 ॥

న కర్మణా న ప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానశుః ।
పరేణ నాకం నిహితం గుహాయాం విభ్రాజతే యద్యతయో విశంతి ॥ ॥ 3 ॥

వేదాంతవిజ్ఞానసునిశ్చితార్థాః సంన్యాసయోగాద్యతయః శుద్ధసత్త్వాః ।
తే బ్రహ్మలోకేషు పరాంతకాలే పరామృతాః పరిముచ్యంతి సర్వే ॥ ॥ 4 ॥

వివిక్తదేశే చ సుఖాసనస్థః శుచిః సమగ్రీవశిరఃశరీరః ।
అంత్యాశ్రమస్థః సకలేంద్రియాణి నిరుధ్య భక్త్యా స్వగురుం ప్రణమ్య ॥ ॥ 5 ॥

హృత్పుండరీకం విరజం విశుద్ధం విచింత్య మధ్యే విశదం విశోకం ।
అచింత్యమవ్యక్తమనంతరూపం శివం ప్రశాంతమమృతం బ్రహ్మయోనిం ॥ ॥ 6 ॥

తమాదిమధ్యాంతవిహీనమేకం విభుం చిదానందమరూపమద్భుతం ।
ఉమాసహాయం పరమేశ్వరం ప్రభుం త్రిలోచనం నీలకంఠం ప్రశాంతం ।
ధ్యాత్వా మునిర్గచ్ఛతి భూతయోనిం సమస్తసాక్షిం తమసః పరస్తాత్ ॥ ॥ 7 ॥

స బ్రహ్మా స శివః సేంద్రః సోఽక్షరః పరమః స్వరాట్ ।
స ఏవ విష్ణుః స ప్రాణః స కాలోఽగ్నిః స చంద్రమాః ॥ ॥ 8 ॥

స ఏవ సర్వం యద్భూతం యచ్చ భవ్యం సనాతనం ।
జ్ఞాత్వా తం మృత్యుమత్యేతి నాన్యః పంథా విముక్తయే ॥ ॥ 9 ॥

సర్వభూతస్థమాత్మానం సర్వభూతాని చాత్మని ।
సంపశ్యన్బ్రహ్మ పరమం యాతి నాన్యేన హేతునా ॥ ॥ 10 ॥

ఆత్మానమరణిం కృత్వా ప్రణవం చోత్తరారణిం ।
జ్ఞాననిర్మథనాభ్యాసాత్పాపం దహతి పండితః ॥ ॥ 11 ॥

స ఏవ మాయాపరిమోహితాత్మా శరీరమాస్థాయ కరోతి సర్వం ।
స్త్ర్యన్నపానాదివిచిత్రభోగైః స ఏవ జాగ్రత్పరితృప్తిమేతి ॥ ॥ 12 ॥

స్వప్నే స జీవః సుఖదుఃఖభోక్తా స్వమాయయా కల్పితజీవలోకే ।
సుషుప్తికాలే సకలే విలీనే తమోఽభిభూతః సుఖరూపమేతి ॥ ॥ 13 ॥

పునశ్చ జన్మాంతరకర్మయోగాత్స ఏవ జీవః స్వపితి ప్రబుద్ధః ।
పురత్రయే క్రీడతి యశ్చ జీవస్తతస్తు జాతం సకలం విచిత్రం ।
ఆధారమానందమఖండబోధం యస్మింల్లయంయాతిపురత్రయంచ ॥ ॥ 14 ॥

ఏతస్మాజ్జాయతే ప్రాణో మనః సర్వేంద్రియాణి చ ।
ఖం వాయుర్జ్యోతిరాపశ్చ పృథ్వీ విశ్వస్య ధారిణీ ॥ ॥ 15 ॥

యత్పరం బ్రహ్మ సర్వాత్మా విశ్వస్యాయతనం మహత్ ।
సూక్ష్మాత్సూక్ష్మతరం నిత్యం తత్త్వమేవ త్వమేవ తత్ ॥ ॥ 16 ॥

జాగ్రత్స్వప్నసుషుప్త్యాదిప్రపంచం యత్ప్రకాశతే ।
తద్బ్రహ్మాహమితి జ్ఞాత్వా సర్వబంధైః ప్రముచ్యతే ॥ ॥ 17 ॥

త్రిషు ధామసు యద్భోగ్యం భోక్తా భోగశ్చ యద్భవేత్ ।
తేభ్యో విలక్షణః సాక్షీ చిన్మాత్రోఽహం సదాశివః ॥ ॥ 18 ॥

మయ్యేవ సకలం జాతం మయి సర్వం ప్రతిష్ఠితం ।
మయి సర్వం లయం యాతి తద్బ్రహ్మాద్వయమస్మ్యహం ॥ ॥ 19 ॥

అణోరణీయానహమేవ తద్వన్మహానహం విశ్వమహం విచిత్రం ।
పురాతనోఽహం పురుషోఽహమీశో హిరణ్మయోఽహం శివరూపమస్మి ॥ ॥ 20 ॥

అపాణిపాదోఽహమచింత్యశక్తిః పశ్యామ్యచక్షుః స శృణోమ్యకర్ణః ।
అహం విజానామి వివిక్తరూపో న చాస్తి వేత్తా మమ చిత్సదాఽహం ॥ ॥ 21 ॥

వేదైరనేకైరహమేవ వేద్యో వేదాంతకృద్వేదవిదేవ చాహం ।
న పుణ్యపాపే మమ నాస్తి నాశో న జన్మ దేహేంద్రియబుద్ధిరస్తి ॥ ॥ 22 ॥

న భూమిరాపో న చ వహ్నిరస్తి న చానిలో మేఽస్తి న చాంబరం చ ।
ఏవం విదిత్వా పరమాత్మరూపం గుహాశయం నిష్కలమద్వితీయం ॥ ॥ 23 ॥

**ఇతి ప్రథమః ఖండః**

సమస్తసాక్షిం సదసద్విహీనం ప్రయాతి శుద్ధం పరమాత్మరూపం ।
యః శతరుద్రీయమధీతే సోఽగ్నిపూతో భవతి సురాపానాత్పూతో భవతి
స బ్రహ్మహత్యాయాః పూతో భవతి స సువర్ణస్తేయాత్పూతో భవతి

స కృత్యాకృత్యాత్పూతో భవతి తస్మాదవిముక్తమాశ్రితో
భవత్యత్యాశ్రమీ సర్వదా సకృద్వా జపేత్ ॥
అనేన జ్ఞానమాప్నోతి సంసారార్ణవనాశనం । తస్మాదేవం
విదిత్వైనం కైవల్యం పదమశ్నుతే కైవల్యం పదమశ్నుత ఇతి ॥ ॥ 24 ॥

**ఇతి ద్వితీయః ఖండః**

ఓం సహనావవతు । సహ నౌ భునక్తు । సహ వీర్యం కరవావహై ।
తేజస్వినావధీతమస్తు । మా విద్విషావహై ॥

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

**ఇత్యథర్వవేదీయా కైవల్యోపనిషత్సమాప్తః**